# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-45 సంచిక - 12 హైదరాబాదు డిసెంబరు, 2025 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 45 Issue - 12 Hyderabad December, 2025 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



BHAGAVAN SRI RAMANA MAHARSHI



ARUNACHALA HILL (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

శ్రీ రమణ జ్యోతి
డిశంబర్ 2025

Sri Ramana Jyothi
December 2025

ఈ సంచికలో ...
IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.యస్. గారి 136వ ప్రవచనం | వి. రామదాస్ మూర్తి | 3 |
| 2 | స్వామి రామదాసు | సరోజా ప్రసాద్ | 13 |
| 3. | శాంతి | అరుణాచల శివ | 17 |
| 4. | దీప దర్శన తత్త్వం (లేఖలు) | | 26 |
| 5. | అనుస్మరణీయులు శ్రీ పిమ్మరాజు రామ సుబ్బారావు | | 28 |
| 6. | God: A Potter | Dr K Subrahmanian | 30 |
| 7. | Ashtavakra Gita 43 | V Krithivasan | 36 |
| 8. | Lucy Cornelssen | Sneha Choudhury | 40 |
| 9. | How I Came to Bhagavan | KC Mohan | 49 |

## Events in Sri Ramana Kendram in December 2025

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd - December - Deepam Celebrations at 6.00 p.m.
3. 7th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
4. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు, e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేసి తెలియజేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్
(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)

# స్త్రీల పట్ల ప్రవర్తన

డా॥ కే.యస్. గారి 136వ ప్రవచనం

అనువాదం: వి. రామదాస్ మూర్తి

ప్రపంచంలో, అతి ధైర్యశాలి అయిన వ్యక్తి, ఎవరితోనో యుద్ధంలో ఎదుర్కొనే సైనికుడు కాదు, క్రొత్తగా పెళ్లి చేసుకున్న బాలిక లేదా మహిళ అని రాజాజీ చెప్పారని నేను విన్నాను. ఆమె తనకు అలవాటైన పరిసరాలను, తల్లిదండ్రులను, అక్కచెల్లెండ్లనూ అన్నదమ్ములను వదిలి, ఒంటరిగా ఒక పూర్తిగా క్రొత్తదైన కుటుంబంతో జీవించడానికి అడుగు పెడుతుంది. అది అత్యంత ధైర్యముతో కూడుకున్న విషయం. తన భర్త ఇంటికి బయలుదేరి, అక్కడికి చేరిన రోజున ఆమెకు కలిగే మిశ్రమ అనుభవాలు వర్ణించడానికి వీలు కానివి. దాదాపుగా, ప్రతీ రోజూ జరిగే అలాంటి సంఘటనలను ఈ సమాజం పెద్దగా పట్టించుకోదు. పెళ్లి చేసుకుని, అత్తారింటికి వెళ్ళిన అమ్మాయి అక్కడి పరిస్థితులకు అనువుగా నడుచుకోవడం ఆమె కర్తవ్యం అని సమాజం భావిస్తుంది. కాని, అది నిజంగా మహా గొప్ప సర్దుబాటు.

ఒక నవ వధువు శరీరం కాల్చుకొని చనిపోయిందని వార్త పత్రికలలో చదివినప్పుడు, అది చాలా దురదృష్టకరమని అంటాము. అది అత్తామామల కారణంగా జరిగిందని చెప్పుకుంటాం. అలాగ వధువు ఆత్మహత్య చేసుకుని లేదా భర్త నుండి విడిపోయి, చదువుకుని స్వతంత్ర జీవనం గడపాలని నిశ్చయించుకునే

సందర్భాలను ఎన్నో గమనించాను. ఇది దుఃఖించవలసిన విషయం. దాని గరించి, తీవ్రంగా ఆలోచించినప్పుడు, అది కేవలం స్త్రీల అత్తమామల వలననే కలగడం లేదనీ, మొత్తం సమాజం బాధ్యత అని తెలియ వస్తుంది. ఒక వైపు మహిళా హక్కులను గురించి పెద్దగా మాట్లాడే మనం వాటి పట్ల ఏ మాత్రం బాధ్యతాయుతంగా ప్రవర్తించడం లేదు. స్త్రీలు తమకు సేవ చేయడం కోసమేనని భావించే పురుషులు కొందరున్నారు. తాము సాధకులమని చెప్పుకునే కొందరు, కాఫీని అందించడం భార్య బాధ్యత అని అనుకునే వారూ ఉన్నారు. మళ్ళీ ఆ కప్పులను పెట్టాల్సిన చోట ఉంచడం కూడా చేయరు. అదీ ఆమే చేయాలని అనుకుంటారు. శ్రీమద్రామాయణం లో, శ్రీ రాముడు శివ ధనుస్సును విరిచినప్పుడు, సీతమ్మ తండ్రి జనకుడు, సీతారాముల వివాహం ఏర్పాటు చేస్తాడు. **ఇయం సీతా, మమ సుత సహ ధర్మచరీ తవ, ప్రతీచ్ఛ చైనామ్ భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా**. నీవు పెళ్లాడబోతున్న వ్యక్తి నా కూతురు సీత. భార్య నిర్వర్తించాల్సిన ధార్మిక విధులను ఆచరిస్తుంది. నీ విధులను నిర్వర్తించడంలో, నీకు సహాయపడుతుంది. అందుకే, ఆమెను సహధర్మచారిణి అని గ్రహించు అని అర్థం.

## స్త్రీల పట్ల భగవాన్ ప్రవర్తన

చాలామంది, స్త్రీకి ప్రత్యేక పాత్ర ఏమీ లేదని భావిస్తారు. కానీ, అది నిజం కాదు. ఆమెకు మీ ఇష్టం వచ్చినట్లుగా పనులు చెప్పడం గొప్ప తప్పు. స్త్రీల పట్ల భగవాన్ ప్రవర్తన మనకు ఆదర్శంగా

ఉండాలి. అది అసాధారణమైనది. ఒక నాటి మధ్యాహ్నం 11.30 గం.ల సమయంలో ఆశ్రమంలో భోజనాల తరువాత వంటశాలలో పనిచేసే సంపూర్ణమ్మ గారు బయట నిలబడి ఉండడం భగవాన్ కంటబడింది. భగవాన్, ఆమె ఎందుకు బయట నించుని ఉన్నది? భోజనం చేసిందా? అని అడిగారు. దగ్గరలో ఉన్నవాళ్ళు, ఆమె ఇంకా తినలేదని, తొందరలోనే తింటుందని చెప్పారు. కారణం అడిగితే, ఆమెకు నెలసరి అనీ, అందుకే, శాస్త్ర ప్రకారం అందరూ భోజనం చేసిన తరువాతనే, ఆమెకు తమ కోసం తయారు చేయబడ్డ వంటకాలు కాకుండా, విడిగా వండిన భోజనాన్ని పెడతారని చెప్పారు. "నెలసరి కావడం పాపమా, అది స్త్రీ ధర్మం. నిజానికి, వాళ్లకు మొదట ఆహారం ఇవ్వాలి. మీరేమో, అందరూ తిన్న తరువాత వాళ్ళు తినాలంటున్నారు. ఆ స్థితిలో ఉన్న స్త్రీలను అలా భిన్నంగా చూడరాదు. వేరుగా వండిపెట్టాలన్న పద్ధతి మానుకోండి" అని మహర్షి అన్నారు. ఆమెను లోపలికి తీసుకెళ్లాలని, అందరూ తినే భోజనాన్ని వడ్డించాలని, ఆమె బయట కాచుకొని ఉండరాదని కూడా చెప్పారు.

మరి ఆచారవంతులనుకుంటున్న వారు అలా చేయటం మంచిది కాదనీ, కొందరు ఆశ్రమానికి రావడం మానేస్తారని సర్వాధికారి అన్నారు. దానికి బదులుగా, భగవాన్ తాము ఆశ్రమానికి వచ్చేవారి గురించి పెద్దగా పట్టించుకోవడం లేదనీ, ప్రస్తుతం

ఆచరణలో ఉన్న పద్ధతి చాలా అన్యాయమని అన్నారు. దయార్ద్రత లేని మతమూ, మానవులను పట్టించుకోని ఆధ్యాత్మికత అసలు ఆధ్యాత్మికత కాదన్నారు. నా ఎదుటే ఆమెకు భోజనం పెట్టాలి, అప్పటిదాకా కదలనన్నారు. అందరికీ ఇబ్బందికరంగా అనిపించింది. కానీ వారు చేయగలిగినది ఏమీ లేదు. ఆమెని లోపలికి పిలిచి, ఆకు వేయించి వంటింటి కార్యకర్తలతో వడ్డన చేయించారు. ఆమె కన్నీటి పర్యంతం అయింది.

ఆ సమయంలో అక్కడ ఉన్న ఛాందసులు తమలో తాము, నెమ్మదిగా, జరిగినది ఎవరికీ చెప్పకూడదని అనుకుంటారు. ఆ మాటలు విన్న భగవాన్, "ఎందుకు చెప్పకూడదు? ఈమె పాపం చేయలేదు కదా, ఈ విషయం అందరికీ చెప్పండి, రహస్యంగా ఉంచనక్కరలేదు. ఒకరెవ్వరో ఆశ్రమానికి చెడ్డ పేరు వస్తుందని అంటే, దానిని గురించి పట్టించుకోకండి. ఇక మీదట, ఏ స్త్రీ పట్ల ఇలా ప్రవర్తించరాదు" అన్నారు. నిజంగా, ఇది ఎంతో అసాధారణమైన విషయం.

చాలామంది స్త్రీలకు, తాము జపం చేయవచ్చునా? సన్న్యాసినులు కావచ్చునా? అన్న అనుమానాలు ఉండేవి ఆ రోజుల్లోనే. ఆశ్రమంలోని కొందరు భగవాన్ అభిప్రాయాలను అంగీకరించేవారు కాదు. కానీ, భగవాన్ వాటిని పట్టించుకునేవారు కాదు. కొన్ని విషయాలలో, స్త్రీ పురుషుల మధ్య, ప్రవర్తించే

విషయంలో ఏ తేడాలు ఉండకూడదని భగవాన్ అభిప్రాయ పడేవారు. స్త్రీలు కూడా (కోహమ్) ఆత్మవిచారణ చేయవచ్చు. పురుషుల్లో సన్న్యాసుల లాగే, మహిళా సన్న్యాసినులకు కూడా అదే రకమైన ఆత్మ సంస్కారాలు చేయాలన్నారు. ఆత్మ సాక్షాత్కారం పొందిన పురుషులవలె, దానిని సాధించిన స్త్రీలను కూడా సమాధి చేయవచ్చన్నారు. ఏ విషయంలోనూ, పురుషుల కంటే, స్త్రీలు తక్కువ కాదని చెప్పేవారు. స్వయంగా భగవాన్ దానిని పాటించడం వల్ల అందరూ దానిని అంగీకరించారు.

## వంటింట్లోని స్త్రీలు

ఆశ్రమాన్ని స్థాపించినప్పుడు ప్రతి రోజూ, భక్తులకు ఉదయం 7 గం.లకు తొలి ఆహారం, 11.30కు మధ్యాహ్న భోజనం, రాత్రి 7.30 గం.లకు రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. భగవాన్ ప్రతి రోజూ తెల్లవారు జామున 3 గం.లకు నిద్ర లేచి, వంటశాలకు వెళ్ళి, అక్కడ కార్యకర్తలకు సహాయపడేవారు. శ్రమతో కూడిన పచ్చడి రుబ్బడం వంటి పనులను తామే చేసేవారు. వాటిని స్త్రీల నెవ్వరినీ చేయనిచ్చేవారు కాదు. సాంబారు, రసం వంటి వంటకాలను మాత్రం కలుపనిచ్చేవారు. ఉదయం 4 గం.లకు హాలులో తమ ఆసనంలో కూర్చునేవారు. కొందరు స్త్రీలకు ఈ విషయంలో అసంతృప్తి ఉండేది. భగవాన్ ప్రసంగిస్తున్నప్పుడు, తాము వంటింట్లో పనిచేస్తుంటే, పురుషులు మాత్రం హాలులో కూర్చొని ఆ ప్రసంగాలను వింటూ ఉండేవారని. ఆ విషయం

భగవాన్ తెలుసుకొన్నారు. వారు తమకు పురుషులవలె, అక్కడ కూర్చుని ధ్యానం చేయడానికి, పనివల్ల వీలు కావడం లేదని చెప్పారు. వారితో, భగవాన్ "మీరు అదృష్టవంతులు. మీరు అలాగ పని చేయకపోతే, మేమంతా ఎలా తినగలం? మీరు గొప్ప సేవ చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేసి తీరాలన్నది లేదు. మీరు భక్తులకు సేవ చేస్తున్నారు. మీరు హాలులోకి వచ్చి మాత్రమే, ధ్యానం చేయాలని లేదు. వంటింట్లో పని చేస్తూ కూడా ధ్యానం చేసుకోవచ్చు. కూరగాయలు తరుగుతూ లేదా ఇతర పనులు చేస్తూ కూడా ధ్యానం చేసుకోవచ్చు. హాలులో ఉన్న వాళ్ళ లాగ, మీరు దేవుడిని తలచుకొంటూ, ఏదో స్తోత్రాన్ని జపం చేయవచ్చు. అయితే, మీరు అదనంగా ఎంతో సేవ కూడా చేస్తున్నారు. ఈ రెండింటినీ, వేరు వేరు విషయాలుగా భావించనక్కరలేదు" అని చెప్పారు.

## సమానత్వం, పరస్పర సహాయం

ఇతరుల అక్కరను గుర్తించని ఆధ్యాత్మికత, అసలు ఆధ్యాత్మికతే కాదు. సమత్వమన్న భావన, పరస్పర సహాయం అన్నవి ఉండాలి. అలాగని, ఎప్పుడూ సహాయం చేస్తూనే ఉండాలని, ఇతరులు దానిని అందుకోవాలని కాదు. భగవాన్ సాంబారు, రసం, వండిన పెద్ద పాత్రలను స్వయంగా దించేవారు. స్త్రీలను చిన్న చిన్న పనులను చేయమనేవారు. వాళ్ళ పట్ల భగవాన్ అలా ప్రవర్తించేవారు. ఈ విషయాలను గురించి పెద్దగా మాట్లాడేవారు కాదు, కానీ ఆ ఆదర్శాన్ని పాటించేవారు. వంట పనుల్లో పురుషులూ లేదా స్త్రీలకు అలా సహాయపడేవారు. తమ కోసం ఎవర్నీ, ఏమీ

అడిగేవారు కాదు. తాము చేయగలిగేవి తామే చేసుకొనేవారు. దీన్ని మనం గుర్తుంచుకోవాలి. పరస్పర సహకారం ఉండాలి.

ధర్మ శాస్త్రజ్ఞుడైన మనువుకు స్త్రీల పట్ల గొప్ప గౌరవ భావం ఉండేది. సమాజం కూడా అలాగే గుర్తించాలని భావించేవాడు. స్త్రీలను గౌరవించని చోట, సంపదలను ఇచ్చే లక్ష్మీదేవి ఉండదనే వారు స్వామి వివేకానంద. భగవంతుడిని స్త్రీ (అంబ), పురుష భావనతో పూజించే మన దేశం చాలా గొప్పది అనేవారు. కానీ దురదృష్టమేమిటంటే, మన జీవితంలో, మహిళలకు తగిన గౌరవం ఇవ్వక పోవడం వల్ల, దేశం పురోగమించడం లేదని, పాశ్చాత్య దేశాలలో ఎన్ని లోటుపాట్లున్నప్పటికీ అక్కడ ఏ కొద్దిమంది పట్లనో కాకుండా అందరి పట్ల గౌరవ మర్యాదలు పాటించబడుతున్నాయి అని అన్నారు.

గాంధీజీ ఒక అసాధారణ మనిషి. రాబోయే పలు శతాబ్దాలలో అలాంటి మరొకరిని మనం చూడలేం. కానీ అలాంటి వ్యక్తి కూడా కొన్ని కారణాలవల్ల వివాహమైన కొన్ని సంవత్సరాల పాటు, తమ భార్య కస్తూరీ బా పట్ల అన్యాయమైన రీతిలో ప్రవర్తించేవారు. వాళ్ళు దక్షిణ ఆఫ్రికాలో ఉంటున్నప్పుడు, పర దేశంలో ఆమె బంధువర్గం ఎవరూ లేని చోట దురుసుగా ప్రవర్తించినట్లు వ్రాసుకున్నారు. ఒకసారి తాము ఆమెను మరుగు దొడ్డిని శుభ్ర పరచమన్నడు, ఆమె అంగీకరించక పోవటంతో, గాంధీజీ ఆమెను ఇంటినుండి వెళ్ళిపొమ్మని అన్నారట. కానీ తరువాత పశ్చాత్తాప పడ్డారట. తరువాతి కాలంలో మహిళా సమస్యలను గురించి

పోరాడారు. భార్యను గురించి ఒక సంప్రదాయపు అభిప్రాయాలున్న వ్యక్తి పూర్తిగా మారి, స్త్రీలు అత్యంత స్వాతంత్ర్యాన్ని కలిగి ఉండాలని అన్నారు. బహుశః గాంధీ గారి ప్రభావం వల్ల వేలకొద్ది మహిళలు స్వాతంత్రోద్యమంలో చేరారు. అందులో కొందరు గొప్ప నాయకురాళ్ళు అయ్యారు కూడా.

కస్తూరీ బా జీవితంలోని ఆఖరి పది ఏళ్లలో, గాంధీజీ ఆమె పట్ల మరింత దయాశీలురయ్యారు. పూణేలోని ఆగాఖాన్ భవనంలో ఆమె చనిపోయారు. పూణేకు వెళ్లినప్పుడు, అందరూ గాంధీజీ, కస్తూరీ బా కొన్ని సంవత్సరాలు కలిసి ఉన్న ఆ స్థలాన్ని దర్శించాలి. విశాలమైన ఆ భవన ప్రాంగణంలో, ఒక ప్రక్క కస్తూరీ బా దహన క్రియలు జరిగాయి. శరీరం కాలడానికి చాలా సమయం పట్టినప్పటికీ, చలిలో గాంధీజీ అక్కడే కూర్చున్నారు. ఎవరో గాంధీజీని లోపలికి రమ్మన్నప్పుడు, "ఏమీ ఫరవా లేదు. అరవై ఏళ్ల పాటు మేము సహజీవనం చేశాము, మరికొన్ని నిమిషాలు ఆమెతో ఎందుకు ఉండనివ్వరు" అన్నారట. ఆ వ్యక్తి హృదయం కరిగింది.

దురదృష్టవశాత్తు, కొందరు తమ భార్యలు తమ కోసం పనిచేయడం కోసమే ఉన్నారని భావిస్తారు. వాళ్ళ ప్రవర్తనను మనం ఖండిస్తాం. ఈ విషయంలో, సమాజాన్ని, సంబంధిత వ్యక్తులనూ తప్పు పట్టడంలో ప్రయోజనం లేదు. మనమందరము ఈ పరిస్థితికి బాధ్యులమని గ్రహించాలి. మనందరి ఉమ్మడి ప్రభావమే దీనికి

కారణం. అప్పుడప్పుడు మనం మత కల్లోలాలను గురించి మాట్లాడు కుంటాం. ఈ సంఘటనలు నిత్యం జరుగుతుంటాయి. వాటికి బాధ్యులం మనమే. ఒక వర్గం ప్రజల పట్ల మనం ద్వేషభావం ప్రదర్శిస్తుంటే, అది వారిలోనూ ఆ భావాన్ని మొలకెత్తిస్తుంది. కొద్ది కాలం తరువాత, ఈ ఆంతరంగిక ద్వేషం రేగి, బహిర్గతమౌతుంది. దానికి మనం ఏవో పేర్లు పెడతాం. అందుకే, ప్రాథమికంగా ఏ వ్యక్తి పట్ల, వర్గం పట్ల ద్వేష భావం పెంచుకొనకూడదు. దానికి ఆంతరంగిక శాంతి అవసరం ఉంది. దానికోసం కొందరు పూజ, జపం, ధ్యానం వంటి వాటిని చేయడం అలవరుచుకుంటారు. అవి అన్నీ కూడా సహాయపడతాయి.

**తీరు మారాలి**

నేను ప్రతి సంవత్సరం చెబుతూనే ఉన్నట్లు, మహిళల పట్ల మన తీరు మారాలి. ఫిర్యాదులు చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. ఎందుకంటే, మనమందరం మానవులుగా, స్త్రీల పట్ల జరిగే హింస, ఇతర రకాలైన దుష్ప్రభావాలకు బాధ్యులమే. ఈ విషయంలో భగవాన్ ప్రవర్తించిన తీరు, జీవన విధానం మనకు గొప్ప ఆదర్శం. నాకు తెలిసినంత వరకు, మహిళల పట్ల వ్యతిరిక్తంగా నడుచుకొనని వ్యక్తి భగవాన్ ఒక్కరే. మన పవిత్ర గ్రంథాలు స్త్రీల గురించి కొంత జాగ్రత్తగా ఉండమని చెబుతుంటాయి, కానీ భగవాన్ అనలేదు. భగవాన్ తమ మాతృమూర్తిని స్కందాశ్రమంలో ఉండనిచ్చారు, జాగ్రత్తగా

చూసుకున్నారు. సాధారణ సంప్రదాయం ప్రకారం, సన్న్యాసి స్త్రీలను, తమ తల్లి అయినప్పటికీ, చూడరాదు అని అంటుంది. తమ చుట్టూ ఉన్న కొందరు, అభిప్రాయాలు వ్యక్తం చేసినప్పటికీ, భగవాన్ తమ తల్లి స్కందాశ్రమంలో, తమతో ఉండవచ్చునన్నారు. ఆమె ఆ తరువాత అక్కడ ఉన్నది ఆరేళ్ళు మాత్రమే. ఆమె దేహం చాలించిన తరువాత, ఒక సమాధి ఏర్పాటు చేయబడింది. దాని మీదనే ఒక ఆలయం నిర్మించబడింది. కానీ దానిని కట్టవచ్చునని గాని, కట్టకూడదని గాని భగవాన్ చెప్పలేదు. ఇతరులకు వదిలి పెట్టారు.

భగవాన్ గురించి చెప్పుకునేందుకు ఇంకెన్నో అంశాలు ఉన్నాయి. కానీ మహిళల పట్ల వారి దయా దాక్షిణ్యాలు అన్నిటికంటే విశిష్టమైనవి. ఈ సంగతిని మనం అప్పుడప్పుడు జ్ఞప్తి లోకి తెచ్చుకుంటే, మన ప్రవర్తనా ధోరణి మారుతుంది. అత్యున్నత స్థాయిలో, ఆత్మ, లింగ భేదాలకు అతీతమైనది.

'పురుష' ఆత్మ, 'స్త్రీ' ఆత్మ అని వేరుగా లేవు,ద్వంద్వం అన్నది లేదు. మన స్థాయిలో, ఆ సంగతి పట్టించుకోము. స్త్రీలు పురుషుల కంటే తక్కువ అన్న ధోరణి నుండి బయట పడాలి.

******

# స్వామి రామదాసు

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Fragrant Petals **లోని వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**సరోజా ప్రసాద్**

స్వామి రామదాసు "భగవదన్వేషణ" అనే పేరుతో తన ఆత్మ కథ వ్రాశారు. (కన్హన్ గాడ్ ఆనందాశ్రమం ప్రచురణ). మహర్షి అనుగ్రహంతోనే తనకు ఆత్మ సాక్షాత్కారం కలిగిందని వారు అందులో పేర్కొన్నారు. అదెలా సంభవించిందో దిలీప్ కుమార్ రాయ్‌కి చెప్పగా ఆయన The Flute Calls Still అనే తన పుస్తకంలో ఇది ప్రచురించారు....

"మీకు ఆత్మ సాక్షాత్కారం ఎలా కలిగిందో చెప్తారా?" అని అడిగాను.

స్వామి రామదాసు కాదనకుండా వెంటనే చెప్పనారంభించారు. ముముక్షుత్వం కోసం తాను తహతహలాడి పోయానని ఈ ఆరాటమే తనను అరుణాచలానికి చేర్చిందని వారు చెప్పారు. అరుణాచలమంటే మాటలా? భగవాన్ శ్రీ రమణ మహర్షుల తపోబలంతో పునీతమైన పర్వతమది...

ఒకనాడు సాధూరామ్ ఈ రామదాసును శ్రీ రమణ మహర్షి దర్శనానికి తీసుకువెళ్ళాడు. ఆ ఆశ్రమం అరుణాచలం చెంతనే ఉన్నది. ఆశ్రమం అంటే కేవలం పూరిల్లు మాత్రమే. ఆశ్రమానికి వచ్చినవారు భగవాన్ పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసేవారు. నిజంగా అదొక పుణ్య స్థలం. వారు మరీ అంత పెద్ద వయస్సు వారు కాదు గాని, వదనం ప్రశాంతంగా ఉండేది. ఎటువంటి

భావమూ లేకుండా వారు చూసే చూపు సందర్శకులను ఆనందంలో ముంచెత్తుతుంది. భగవాన్‌కు ఆంగ్లభాష వచ్చునని తెలిసి రామదాసు అమితానందపడ్డాడు.

“మహారాజ్ మీ సేవకుడు తమ ఎదుట నిలబడ్డాడు, కరుణించండి. మీ ఆశీస్సుల కోసం ప్రార్థిస్తున్నాడు” అన్నాడు రామదాసు. అది విన్న మహర్షి రామదాసు వైపు చూపు త్రిప్పి, తదేకంగా అతడి కన్నులలోకి చూశారు. ఆ వీక్షణమే ఆశీర్వాదం అనిపించింది. అదే అర్థం వచ్చేలా తలకూడా పంకించారు. తనువెల్లా ఆనందం ముప్పిరిగొనగా రామదాసు కంపించిపోయాడు.

సాధూరామ్ ప్రోద్బలంతో కొన్ని రోజులు ఏకాంతంలో గడపాలని ఆశపడ్డాడు రామదాసు. కాలయాపన చెయ్యకుండా అతడిని ఆలయం వెనుక అరుణాచలం కొండపైకి తీసుకెళ్ళాడు సాధూరామ్. కొండపైనున్న అనేక గుహలను చూపించాడు. వీటిలో ఒక చిన్న గుహను రామదాసు ధ్యానం కోసం ఎంపికచేశాడు. మరుసటి రోజు వచ్చి ఆ “గుహ ప్రవేశం” చేశాడు రామదాసు. అలా ఒక నెల రోజుల పాటు ఏకాంతంగా ధ్యానంలోను, భజనలోను గడిపాడు. నిరంతరాయంగా ఆ తారకరాముని ధ్యానంలో అపురూప అవకాశం లభించింది. అనిర్వచనీయమైన ఆనంద సాగరంలో మునకలు వేశాడు. శ్రీరామచంద్ర పరబ్రహ్మ ధ్యానమే పరమానందకరం. ఆ ధ్యానంలో పూర్తిగా లీనమైన రామదాసుకు శ్రీరామచంద్రుడు సాక్షాత్కరించాడు.

“ఆ సమయంలో మీరు కనులు మూసుకున్నారా? కనులు తెరిచే రామచంద్రుని తిలకించారా?” అని అడ్డు తగిలాను. కనులు

పూర్తిగా తెరిచే చూశాను. నిన్ను చూస్తున్నంత స్పష్టంగా చూశాను'', అన్నారు రామదాసు. ''కాని ఈ క్షణికమైన దర్శనం కోసం కాదు తానింతగా ఆరాటపడింది...ఇటువంటి దర్శనం ఎంతో సేపు ఉండదని తనకు తెలియంది కాదు. కనుక, ఎన్నటికీ చెరిగిపోని, ఎడబాటు లేని దర్శనం కావాలని ఆ పరమాత్మను వేడుకున్నాడు.

ఈ సకల చరాచర జగత్తులోనూ ఆ రాముడే గోచరమయ్యే విశ్వరూప దర్శనం అనుగ్రహించమని ప్రార్థించాడు రామదాసు.

''ఎట్టకేలకు ఒకనాడు ఉదయం ఆ విశ్వరూప దర్శనం లభించింది. ఎటు తిరిగినా, ఎటు చూసినా అంతటా ఆ రామచంద్రుడే! నా చుట్టు ప్రక్కల ఆ రాముడే! చెట్టు చేమలు, చీమలు, ఆవులు, పిల్లులు, శునకాల వంటి ప్రాణులే కాదు, సమస్త జడపదార్థాలు సైతం ఆ శ్రీరామచంద్ర పరబ్రహ్మ చైతన్యంతో తొణికిసలాడుతున్నాయి. ఆ పారవశ్యంలో రామదాసు పసిపిల్ల వాడిలా గంతులు వేశాడు. తన్మయత్వం పట్టలేక సమీపంలో ఉన్న ఒక చెట్టును ఆలింగనం చేసుకున్నాడు - అది చెట్టు కాదు, సాక్షాత్తు శ్రీరామచంద్రుడే అందులో భాసించాడు. ప్రక్కన నడిచి వెళ్తున్న ఒక ఆగంతకుని కూడా ''రామా, రామా'' అంటూ ఆలింగనం చేసు కోవడంతో అతడు బెదిరిపోయి పరుగు లంకించుకున్నాడు! రామదాసు విడవకుండా అతడి వెంట పరుగెత్తి పట్టుకొని, తన గుహకు లాక్కు వచ్చాడు. రామదాసుకు పళ్ళు లేవని గుర్తించిన ఆ మనిషికి ధైర్యం వచ్చింది, ఈ పిచ్చివాడు తనను కొరకలేడని!

ఇది చెపుతూ రామదాసు పగలబడి నవ్వారు. మేమూ శ్రుతి కలిపాము. ''తరువాత ఏమైంది'' అని అడిగాను. ఆ ఆనందం,

పారవశ్యం శాశ్వతంగా నిలిచిపోయాయి. కొండలపైనుండి ఉరక లెత్తి వచ్చిన ప్రవాహం క్రిందకి వచ్చేసరికి ఒడిదుడుకులు లేకుండా ప్రశాంతంగా మారినట్లు నా ఉద్వేగం నెమ్మదించింది. ఈ అనుభవాన్నే సహజ సమాధి అంటారు. ఇందులో ఆ పరమాత్మ చైతన్యం నుండి నువ్వెన్నటికీ వేరు కాలేవు. నీ చుట్టూ ఉన్న సమస్త ప్రకృతితోను నువ్వు తాదాత్మ్యం చెందుతావు. అంతటా అద్వితీయుడైన ఆ సర్వాంతర్యామినే చూస్తావు".

చివరిగా, ఆనందాశ్రమం ప్రచురించే విజన్ పత్రికలో నలభై ఏళ్ళ తరువాత రామదాసు ఏమన్నారంటే, "ఈ భౌతిక ప్రపంచ విస్మృత స్థితిలో రామదాసు రమణ మహర్షి వద్దకు వెళ్ళాడు. వారి సన్నిధిలో తన్మయావస్థ అనుభవించాడు. ఆ అనుభవాన్ని, ఆ చైతన్యాన్ని మహర్షి శాశ్వతం చేశారు".

"మీరు రమణ మహర్షి వద్దకు వెళ్ళి, ఆత్మ సాక్షాత్కారం పొందారు కదా, మాకు అదే విధంగా మోక్షం ప్రసాదించండి" అని కొందరు భక్తులు రామదాసును కోరారు. దానికి ఆయన ఇలా సమాధానమిచ్చారు, "నేను ఏ స్థితిలో మహర్షి వద్దకు వెళ్ళానో మీరు ఆ స్థితిలో నా దగ్గరికి రావలసి ఉంటుంది. అప్పుడే మీకు ఆ సాక్షాత్కారం లభిస్తుంది. రామదాసు ఎంతగా ఆరాటపడ్డాడు? భౌతిక జగత్తును ఏ విధంగా విస్మరించాడు? మీరూ ఆ స్థితిలో రాగలిగితే సరే."

******

# అరుణాచల ఋషితో గడిపిన చిరస్మరణీయమైన దినములు-2

## శాంతి

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Surpassing Love and Grace **లోని వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**అనువాదకులు: అరుణాచల శివ**

సెప్టెంబరు 15, 1943 నా జీవితంలో చాలా ప్రాముఖ్యత కలిగిన దినము అని నేను నమ్ముతాను. ఎందుకంటే, మధుర స్మృతిని మిగిల్చిన ఆ దినము, నన్ను ఆధునిక భారతదేశంలో జీవించి ఉన్న ఒక గొప్ప సాధువును పరిచయం చేయించిన రోజు కనుక. ప్రతిరోజు శ్రీ భగవాన్ వంటి గొప్ప సాధువును మనము కలువము. వారిని కలిసే అవకాశం రావడానికి కారణం, బహుశః భగవంతునితో నేను చేసిన ప్రార్థనా ఫలితము కావచ్చునని నేను భావిస్తున్నాను.

సెప్టెంబరు 15వ తేదీ ఉదయం 7 గంటలకు నేను ఆశ్రమం చేరాను. భగవాన్, పెద్దదిగా ఉన్న భోజనశాలకు ఉపాహారము తీసుకోవటానికి వెళ్ళారు. భక్తులందరూ వారిని అనుసరించి వారి వారి స్థానాలలో ఒకరి తరువాత ఒకరు కూర్చున్నారు. భగవాన్ పాత భక్తులైన ఒకరి నుండి, నిరంజనానంద స్వామిని ఉద్దేశిస్తూ వ్రాసిన ఒక నివేదనా పత్రము నేను తీసుకు వచ్చాను. ఆ ఉత్తరాన్ని నేను వారికి ఇచ్చాను. అది చూసి వారు నన్ను భోజనశాలకు తీసుకుని వెళ్లి భగవాన్‌కు పరిచయం చేశారు. భగవాన్ నన్ను మృదువుగా, ఆప్యాయంగా చూస్తూ ఆహ్వానించారు. నేను భగవాన్‌కు ప్రణామములు అర్పించి పైకి లేవగానే దగ్గరలో ఉన్న ఖాళీ స్థలాన్ని సైగలతో చూపి కూర్చోమని అనడంతో నేను అక్కడ

కూర్చున్నాను. భగవాన్ కళ్ళు నా మీద పడిన క్షణం నుండి నా హృదయంలో వారి యందు ప్రేమ, భక్తి ఉప్పొంగాయి. వారు ఆహారం తీసుకున్న విధానము, వారు కూర్చున్న విధానము, వారు నడిచిన తీరు, వారు మాట్లాడిన విధానము, వీటన్నిటిలో కల అసాధారణమైన ప్రశాంతత, సాధారణ వ్యక్తుల పద్ధతి కంటే భిన్నంగా ఉన్నది. ఒక సాధువు, జీవన్ముక్తుడు అయినటువంటి వాడు ఎలా ఉంటాడు అనటానికి పరిపూర్ణమైన ఉదాహరణ శ్రీ భగవాన్ అని నేను అనుకున్నాను. స్థితప్రజ్ఞుని లక్షణాలను గురించి భగవంతుడైన శ్రీకృష్ణుని, అర్జునుడు అడిగిన ప్రశ్నలోని ప్రాముఖ్యత ఇప్పుడు నాకు అవగతమయింది. ఆ ప్రశ్నలు చాలా ముఖ్యమైనవి. ఎందుకంటే అందులో ఒక స్థితప్రజ్ఞుడైన సాధువు కూర్చునే విధానం, మాట్లాడే విధానం సాధారణమైన వ్యక్తుల వలె కాక, వారు ఏది చేసినా దానికొక విశిష్టత ఉంటుందని తెలియజేయబడినది. ఇది అర్థం కావాలంటే ఒక సాధువును మనంతట మనముగా దర్శించి వారి పాదాల చెంత కూర్చోవాలి.

9 గంటల సమయంలో భగవాన్ ధ్యాన మందిరంలోకి వచ్చారు. వారితో పాటు మేమందరమూ కూడా జతకూడి వారికి ఎదురుగా కూర్చున్నాము. వారు సోఫాలో జారగిలి మావైపు ముఖం పెట్టి కూర్చున్నారు. నేను ఆ ధ్యాన మందిరంలో కూర్చొనగానే చక్రవర్తి యైన దుష్యంతుడు 'ఆశ్రమములో శాంతి వెలసిల్లుతుంది' అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. ఈ ఆశ్రమంలో కూడా అది నిజమని అర్థమయింది. నా జీవితంలో మొట్టమొదటిసారి శాంతి ఎంత మహత్తరమైనది అని అనిపించింది. ఆ శాంతి భగవాన్ నుండి

బహిర్గతమై అందరి హృదయాలను నింపివేస్తున్నది. వారి సన్నిధిలో మనస్సు తనంత తాను ప్రశాంతంగాను మరియు మౌనంగాను ఉంటున్నది. దానితో సందేహాలు మరియు ప్రశ్నలు తక్కువైపోతు, చివరిగా తుడిచిపెట్టుకు పోతున్నాయి. నేను ఎంతో సంతోషపడ్డాను. నా హృదయంలో ఒక్కసారిగా కార్తికేయుడు మృదువుగా "ధన్యోహం ధన్యోహం" అన్న మాటలు మాట్లాడినట్లు వినిపించింది.

భక్తులందరూ ధ్యానమందిరంలో భగవాన్ ఎదురుగా మధ్యాహ్నం 12 గంటల వరకు కూర్చున్నారు. మధ్యాహ్న భోజనానికి సమయమైంది అని తెలియజేయడానికి గంట కొట్టినప్పుడు, భగవాన్ సోఫాలో నుండి లేచి చేతి కఱ్ఱను పుచ్చుకుని నెమ్మదిగా కదులుతూ, ధ్యాన మందిరాన్ని దాటి భోజనశాలకు వెళ్ళారు. ఆహార పదార్థాలను వడ్డించిన తరువాత, భగవాన్ మొదటి ముద్ద తీసుకునే వరకు మేము వేచి ఉన్నాము. అటు తరువాత మేము కూడా ఆహారాన్ని స్వీకరించాము. అరగంటలో భోజనం చేయడం పూర్తి కావడంతో, భగవాన్ తిరిగి ధ్యాన మందిరానికి వెళ్ళారు. రెండు నుండి మూడు గంటలు విరామము తీసుకున్న తరువాత సాయంత్రం 4 గంటల సమయంలో తిరిగి ధ్యాన మందిరంలోకి భక్తులందరూ చేరి భగవాన్ ఎదురుగా కూర్చున్నారు. కొంతమంది అక్కడ ఉన్న ప్రశాంతతకు అనుగుణంగా తామూ శాంతమనస్కులైనారు, కొంత మంది ధ్యానచిత్తులైనారు, కొంతమంది వారికున్న ప్రశ్నలను అడిగి సందేహాలను తీర్చుకుంటున్నారు. మరికొంత మంది భగవాన్‌కు, ఎంతో మంది సందర్శకులకు మధ్య జరిగే సంభాషణలను కుతూహలంతో వింటూ ఉన్నారు. ఆ

సంభాషణలను వినటం అనేది కూడా ఒక బోధయే. భగవాన్ భౌతిక కాయము కనుమరుగై పోయింది కాని, ఎవరమైతే వారి సన్నిధిలో కూర్చుని, వారి ప్రశాంతమైన, గంభీరమైన మాటలను విన్నామో అటువంటి భక్తులమైన మాలో వారి రూపము, బోధ మా హృదయాలలో చెరగని ముద్రను వేశాయి. అటువంటి వారి రూపము, బోధ పరిస్థితులు మారినంత మాత్రాన లేదా కాలము మారినంత మాత్రాన చెరిగిపోదు. మా అందరికీ ఈ జ్ఞాపకాలు వెలకట్టలేనంత విలువైన నిధి వంటివి. ఇటువంటి జ్ఞాపకాలను ఆశ్రమం వారు పుస్తకాలుగా ముద్రించాలని భావిస్తున్నందుకు మేము కృతజ్ఞులము. ఆ పుస్తకాలు మమ్మల్ని భగవాన్‌తో మేము గడిపిన రోజులను గుర్తుచేస్తాయి.

నాకు ఎంతో ప్రాముఖ్యతను కలుగజేసిన ఒక సంఘటనను ఇప్పుడు నేను తెలియపరుస్తాను. నేను ఆశ్రమమునకు వచ్చిన రెండు లేదా మూడు రోజుల తరువాత, భగవాన్‌కు అంకితమిస్తూ ఒక సంస్కృత శ్లోకాన్ని కూర్చగలననే నమ్మకం కొంచెం కూడా లేదు. అయితే, ఆ కోరిక ఆంతరంగికంగా కలిగింది కనుక, భగవంతుని కృపతో మూగవాడు కూడా గొప్ప మాటకారి అయిన విధంగా, నేను కూడా భగవాన్‌ను ప్రార్థిస్తే, భగవాన్ నా కోరికను తీరుస్తారనే భావన నాలో కలిగినది. దానితో నేను, వారి కృపను నా యందు ప్రసరింపజేయమని, దాని ద్వారా నా కోరిక నెరవేరాలని హృదయ పూర్వకంగా ప్రార్థించాను. ఆ రోజు మధ్యాహ్నం కాసేపు ఒక కునుకు తీద్దామని పడుకున్నాను. ముప్పావుగంట అయిన తరువాత, లేచి లేవగానే ఒక శ్లోకం నా మదిలో కదిలింది. అది భగవాన్ అనుగ్రహ

మని నాకు అనిపించింది. నా ప్రార్థన ఫలించింది అని అనిపించింది. గొప్ప ఆనందముతో నేను ఆ శ్లోకాన్ని ఒక చిన్న కాగితం మీద వ్రాశాను.

ఆ రోజు మధ్యాహ్నం హాలుకు వెళ్లి ఆ శ్లోకాన్ని భగవాన్ పాదాల వద్ద ఉంచాను. భగవాన్ ఆ శ్లోకాన్ని తీసుకుని రెండు లేదా మూడుసార్లు చదివి, మృదువుగా 'రమణ మహర్షి' అని ఉన్నచోట 'శోణ శైలం' అని మార్చమన్నారు. అప్పుడు నేను నాలుగవ చరణాన్ని మార్చడంతో "నేను రమణ మహర్షిని మనస్సులో ధ్యానిస్తాను'కు బదులు "నేను శోణ శైలంను మనస్సులో ధ్యానిస్తాను" అనే అర్థం వచ్చింది. దానితో భగవాన్ ఎవరో కాదు సాక్షాత్తు ఆ అరుణాచలేశ్వరుడే లేదా దక్షిణామూర్తియే అని నాకు అనిపించింది. ఆ దక్షిణామూర్తియే తన భక్తులకు ఆంతరంగిక మౌనం ద్వారా ఆత్మ సాక్షాత్కార రహస్యాన్ని తెలియబరిచారు. ఈ విషయం నాలో స్ఫురించగానే, నా కళ్ళు ఆనందముతో, కృతజ్ఞతతో చెమర్చాయి. దానితో నేను భగవాన్‌కు సాష్టాంగ దండప్రణామములు అర్పించి వెళ్లి గోడకు దగ్గరగా కూర్చున్నాను.

నేను భగవాన్ వద్దకు వచ్చిన తరువాత మాత్రమే కొన్ని ఆధ్యాత్మిక సత్యాలు స్పష్టంగా అర్థమయ్యాయి. దానికి ఒక ఉదాహరణను ఇక్కడ చెప్పదలచుకున్నాను. నేను ఆశ్రమంలో ఉన్నప్పుడు నేను ఎంతో ఎక్కువ మననము, నిధి ధ్యాసనము చేశాను. జాగ్రత్ అనుభవానికి, సుషుప్తి అనుభవానికి గుణాత్మకమైన వ్యత్యాసం ఏమీ లేదు అని భగవాన్ చేసిన బోధను గ్రహించడంలో నాకు ఎటువంటి ఇబ్బంది అనిపించలేదు. కాని, నా అనుభవాన్ని

నేను విచారణ చేసినప్పుడు, సుషుప్త్యావస్థని గ్రహించడం కష్టతరమైనది. ఆ స్థితిలో ఏమీ లేనట్లు, నా ఎఱుకలో శూన్యం మాత్రమే ఉన్నట్లు, ఆ ఎఱుకలో అంతరాయం ఏర్పడినట్లు అనిపించింది. నిజమైన 'నేను' శాశ్వతంగాను, నిరంతరంగాయంగాను ఉంటూ అది మనస్సు, బుద్ధి, అహంకారము మరియు చిత్తాన్ని దాటి ఉంటుందని భగవాన్ అన్నారు. కాని నా ఎఱుకలో అంతరాయం ఏర్పడుతోందని గుర్తించాను. అయితే, నా నిజమైన 'నేను' లేదా నిజమైన ఆత్మ ఎక్కడ? దానికి సరైన సమాధానము లేదని నాకు తోచింది. ఆ స్థితిని దాటి పోలేకపోయాను. మనస్సులో ఆ విషయాన్ని భగవాన్ వద్ద ఉంచి, వారి అనుగ్రహం కోసం వేచి చూస్తున్నాను. ఆశ్చర్యం! ఒకరోజు ఆ అజ్ఞానపు పొర తొలగి, క్రితం నేననుకున్నట్లు సుషుప్తి అనేది శూన్యం కాదని, 'నేను' అనేది గాఢ నిద్రలో కూడా ఉంటుందని, ప్రపంచ రహిత స్థితి, శరీరము, మనస్సు లేని ఆ స్థితి కూడా 'నేను' అనే ఎఱుకలో భాగమే అని స్ఫురించింది. 'నేను' లేదా ఎఱుక నిరంతరాయంగా ఉన్నట్లు ఆంతరంగికంగా స్పష్టంగా తెలుస్తున్నది. జాగ్రదవస్థలో నేను ప్రపంచానికి, మనస్సుకి, శరీరానికి సాక్షిని; స్వప్నావస్థలో, నేను స్వప్నానికి సాక్షిని; సుషుప్త్యావస్థలో ప్రపంచరహిత స్థితికి సాక్షిని. కాబట్టి 'నేను' ఈ మూడు అవస్థల యందు ఉన్నాను. ఈ విధమైన లోతైన అవగాహన నాలో కలగడం నాకు ఆశ్చర్యం కలిగించింది. దానితో నాకున్న అన్ని సందేహాలు మరెప్పటికీ రాకుండా మాయమైపోయాయి. నన్ను నేను తెలుసుకోవడమంటే 'నాకు నేను'గా ఉండడమే అని అర్థమైంది.

ఆత్మ జ్ఞానాన్ని గురించి కేవలం చదవడం, ఆలోచించడము వల్ల ఎటువంటి ప్రయోజనము లేదు. భగవాన్ వంటి సాధువు ద్వారా భగవంతుని అనుగ్రహాన్ని పొందినప్పుడు మాత్రమే, మన పురాణ ఋషులు వెల్లడించిన జ్ఞాన ప్రసూనాలను సరియైన విధంగా అవగాహన చేసికొనగలము. శంకరాచార్యుల వారు చెప్పిన విధంగా జీవన్ముక్తిని చేరుకోవడం అనే సోపానములో మొదటి మెట్టు సత్సంగము. అంటే సాధు పురుషులు, మహాత్ములతో కూడి ఉండడము. వివేక చూడామణిలో ఈ విధంగా తెలియజేశారు.

"ఎంతోమంది మంచి హృదయం కలవారు, ఉదాత్తమైన గుణం కలిగి ప్రశాంతగా ఉన్నవారు, వసంత ఋతువులా అందరికీ మంచిని పంచుతూ, భయంకరమైన జనన మరణ సంసారమనే సముద్రాన్ని దాటి, ఎటువంటి స్వార్థం లేకుండా, ఈ సంసార చక్రాన్ని దాటాలని ఎవరైతే ప్రయత్నిస్తున్నారో వారికి సహాయపడుతూ ఉంటారు". అటువంటి మంచి హృదయం కలవారు మన భగవాన్. అన్నింటినీ ఉపేక్షిస్తూ ఉన్నట్లు పైకి గంభీరంగా కనిపించిన ఈ మహత్తరమైన ఋషి, వారిని సమీపించినవారి హృదయాలలో వారిలోని ప్రేమను మరియు మృదుత్వమును స్పష్టంగా భావించ గలిగారు. భగవాన్ జీవించిన సమీప కాలంలో మనం జీవించడం, సరియైన దృక్పథంతో వారిని దర్శించడం అనేది గొప్ప చరిత్రగా నిలుస్తుందని నా భావన. సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ, వారి ఆధ్యాత్మిక మాహాత్మ్యము హిమాలయ శిఖరమంత మహోన్నత ముగా వ్యాప్తి చెంది, భావితరాల వారు వారిని శ్రీ దక్షిణామూర్తిగా భావిస్తారనడంలో సందేహం లేదు. అటువంటి మహోన్నతమైన ఋషి మనకు జ్ఞానోదయమును కలిగింతురు గాక.

## గమనిక/విజ్ఞప్తి

శ్రీ రమణ మహర్షి భక్తులకు, శ్రీరమణ జ్యోతి మాస పత్రిక పాఠకులకు శుభాభివందనలు.

మీలో ఎందరో చిరకాలంగా, ఈ పత్రికను ఆదరిస్తూ, అందులో ప్రచురించబడుతున్న శ్రీ రమణ మహర్షి పవిత్ర జీవితాంశాలను, వారి బోధలను, ఇతర ఆధ్యాత్మిక విశేషాలను, ఆస్వాదిస్తూ ఉన్నారు. కృతజ్ఞతలు. అందులో భాగంగా పాఠకుల సౌకర్యార్థం, శ్రీ రమణ జ్యోతి విడి పత్రిక ధర రూపాయలు 10/- గాను, వార్షిక చందా రూపాయలు 100/- గాను, జీవితకాలం చందా రూపాయలు 1000/- గాను ఉండటం చాలా కాలంగా కొనసాగుతూ ఉన్నది.

క్రమేపి, అన్ని నిత్యావసర వస్తువులతో పాటు, కాగితపు ధర, ముద్రణ ఖర్చులు పెరుగుతూనే పోతున్నాయని మీరు గ్రహించి ఉంటారు. అదే విధంగా తపాలా శాఖ వారు ఆధ్యాత్మిక పత్రికలకు (తపాల బిళ్ళపై) ఇచ్చే రాయితీలను ఎత్తివేయడమే కాక, ఇప్పుడు ప్రతీ పత్రికపై అంటించే 25 పైసల తపాలా బిళ్ళకు బదులు పత్రిక బరువును బట్టి ఒక్కొక్క పత్రిక అంటించే తపాలా బిళ్ళ ధర రూపాయలు 2/- నుండి రూపాయలు 4/- వరకు పెరగవచ్చు.

దానితో ఇప్పుడు ఉన్న పరిస్థితులకు, ధరలకు అనుగుణంగా శ్రీ రమణ జ్యోతిని అందించటం కష్టతరమవుతున్నది. అందువల్ల

శ్రీ రమణ జ్యోతి వార్షిక, జీవితకాల చందాలను పెంచక తప్పడం లేదు. సహృదయులైన పత్రిక చందాదారులు, పోషకులు విషయాన్ని అర్థం చేసుకోగలరని మా విశ్వాసం.

జనవరి 2026 సంవత్సరం నుండి శ్రీ రమణ జ్యోతి విడి పత్రిక ధర రూపాయలు 20/- గాను, వార్షిక చందా రూపాయలు 240/- గాను, జీవితకాల చందా (10 సంవత్సరములకు) రూపాయలు 2000/- గాను నిర్ణయించడమైనది. పాఠకులు సహకరించగలరు.

## ముఖ్య గమనిక

1. పాఠకుల సౌకర్యార్థం జూన్ లేదా జూలై 2026 నాటికి శ్రీ రమణ జ్యోతి పత్రికను సంపూర్ణ తెలుగు మాసపత్రికగా రూపొందించడానికి ప్రయత్నిస్తున్నాము.
2. చందాదారులు (వార్షిక, జీవితకాలపు) పెరిగిన ధరలకు అనుగుణంగా అదనంగా కట్టవలసిన మొత్తాన్ని జనవరి 2026 సంవత్సరం నాటికి శ్రీ రమణ కేంద్రం కార్యాలయము నకు పంపి పత్రికను నిరాటంకంగా తెప్పించుకోవలసినదిగా ప్రార్థన.

ప్రచురణ కర్త
**పి. కేశవ రెడ్డి**

# దీప దర్శన తత్త్వం (లేఖలు)

“అరుణాచలం లింగోద్భవాన్ని గురించి భగవాన్ ఒక పద్యం వ్రాశారు కాబోలే?” అన్నా నేను (సూరి నాగమ్మ) . “అవును. విక్రమ సంవత్సర శివరాత్రికి ఎవరో అడిగితే వ్రాశాను. తెలుగులో గూడా వ్రాశానేమో?” అన్నారు భగవాన్. “అవును. ధనుర్మాసంలో ఆర్ద్రా నక్షత్రం నాడు లింగోద్భవమైనదనీ, ఆ లింగంలో నుండి బయల్వెడలిన శివుణ్ణి విష్ణువూ, దేవతలూ సేవించిన దినమే శివరాత్రియనీ, అది కుంభమాసమనీ ఆ పద్యంలో చెప్పారు. అందుకు మూలకథ ఏమిటి? కృత్తికోత్సవ సందర్భం ఏమిటి?” అన్నాను.

“అదా, బ్రహ్మ విష్ణువూ ‘నేను పెద్ద నేను పెద్ద’ అని వాదులాడు కుంటూ ఉంటే, కార్తిక మాసంలో కృత్తికా నక్షత్రం నాడు ఆ బ్రహ్మ విష్ణువుల మధ్యన జ్యోతిస్తంభం ఆవిర్భవించిందట. అందువల్ల ఆ చిహ్నంగా ఆ నెలలో ఆ నక్షత్రం నాడు దీపోత్సవం జరుగు తున్నది. బ్రహ్మ విష్ణువూ ఆ స్తంభానికి ఆదీ, అంతం తెలుసుకోవాలని వెళ్ళి వెతకి వెతకి వేసట చెందినారా? గర్వవర్జితులై ఇద్దరూ ఒక్క చోటున చేరుకొని పరదైవాన్ని ప్రార్థిస్తే ఆ జ్యోతిస్తంభాంతర్గతుడైన సదాశివుడు వారి దృష్టికి గోచరించి అనుగ్రహించాడనీ, వారు ‘మాకు సేవమానుడవై ఉండా’లని ప్రార్థిస్తే, పర్వతాకారంగానూ, లింగాకారంగానూ ఉంటానని చెప్పి, లింగార్చన విధానం బోధించి, మీరందరూ లింగాకారంతో ఉండే

నన్ను అర్చిస్తే కొన్నాళ్ళకు ఆ లింగంలో నుండి నా అంశం వల్ల శివమూర్తి రుద్రనామంలో వెలువడి మీకు సహాయకారిగా ఉండ గలడనీ చెప్పి అంతర్హితుడైనాడట. ఆ వెనుక ధనుర్మాసంలో, ఆర్ద్రా నక్షత్రం నాడు జ్యోతిర్లింగమైన అరుణగిరి నుండి స్వయంభూ లింగం ఆవిర్భవించిందనీ, నాటినుండీ ఈశ్వరాదేశానుసారం వారందరూ లింగార్చన విధిని అనుష్ఠిస్తూ రాగా, కుంభమాసంలో కృష్ణ పక్ష త్రయోదశినాడు, అర్ధరాత్రివేళ ఆ లింగంలో నుండి శివమూర్తి ఆవిర్భవించి, హరి సురల చేత సేవింపబడటం వల్ల ఆ దినమే 'శివరాత్రి' అనీ, లింగ పురాణంలోనూ, శివపురాణంలోనూ చెప్పి ఉన్నది. నాటినుండే లింగార్చన విధానం ఆరంభమైనదట. ఈ అరుణాచల లింగోద్భవమే ప్రథమ లింగోద్భవమని స్కాంద పురాణములో దృఢంగా చెప్పి ఉన్నది. నా పద్యానికి మూల శ్లోకం లింగ పురాణంతర్గతమే'' అని సెలవిచ్చారు భగవాన్.

భగవాన్ పద్యం ఇది (లింగోద్భవం)

కం. **తొలి యరుణాచల లింగము**
**కలిగెను ధనువునెల్ల నార్ద్ర ఘనలింగమునన్ ।**
**వెలివడు శివుని హరి సురలు**
**గొలిచిన దినమె శివరాత్రి కుంభపు నెల నౌ ॥**

'ఈ శరీరమే నేను' అనే తలంపును పరిపూర్ణంగా నాశనం చేసి, ఆ బుద్ధి హృదయంలో ప్రవేశించి, అందులోనే వసిస్తూ అంతర్దృష్టి వలన అద్వైతమగు నిజాహంజ్యోతిని గాంచుము. అదే భూమధ్యమగు ''అరుణాద్రి దీపదర్శన తత్త్వం'' అని భగవాన్

# అనుస్మరణీయులు - శ్రీ పిమ్మరాజు రామ సుబ్బారావు

(గత సంచిక తరువాయి)

కే.యస్. గారి గురించి మీరు వారిని కదిలిస్తే, ఇక మీరక్కడి నుండి కదలలేరు. కే.యస్. గారి గురించే కొన్ని గంటలు మాట్లాడుతారు. భగవాన్‌కు సంబంధించిన విషయాల కంటే ఎక్కువగా కే.యస్. గారి గురించి మాట్లాడేవారు. ఒకానొక సమయంలో వారు విపరీతంగా శివ మహా పురాణం చదవటం మొదలుపెట్టారు. అలా చదవటం మొదలైన తరువాతి కాలంలో వారిలో చాలా మార్పును గమనించాను నేను. వారిని ఎవరో లాగుతున్నారు అని అనిపించింది. తీరా చూస్తే అది వేల్చూరు మౌన స్వామివారు. వేల్చూరు స్వామివారు చాలా సాధారణంగా కనిపించినా, ఆయన ఒక అసాధారణమైన వ్యక్తి అని గుర్తించారు సుబ్బారావుగారు. 'స్వామివారు మహాత్ములు. ఆయన సమక్షంలో నేను ధ్యానంలో కూర్చోగలుగుతున్నాను. వాటంతటవే కళ్ళు మూసుకొని పోతున్నాయి. పరమ ప్రశాంతత అనుభవిస్తున్నాను. ఈ అనుభవం నాకు వేరేచోట కలగటం లేదు. ఒక్క కే.యస్. గారి వద్ద తప్ప. కే.యస్. గారు ఒక్కొక్కసారి కొన్ని వారాలపాటు ఏమీ మాట్లాడకపోయినా వారి సమక్షంలో నాకు శాంతి లభిస్తున్నది. అటువంటి ప్రశాంతతను ఇవ్వ గలిగిన వారు గురువు అని శాస్త్ర ప్రమాణం.

సుబ్బారావు గారు ఒకసారి మౌనస్వామితో ఇలా అన్నారట - 'స్వామీ నేనేమీ సాధన చేయలేకపోతున్నాను. ఇంతకుమునుపు కూడా ఎటువంటి సాధనా చేయలేదు. నా ఆరోగ్యం బాగుండదు.

ధ్యానం చేయలేను. అటువంటప్పుడు నేనేమి చెయ్యాలి స్వామీ?' అని అన్నారట. దానికి స్వామి వారు "మీరేమీ చేయవలసిన అవసరం లేదు. మిమ్మల్ని రమణులు చెయ్యి పట్టుకొని బ్రహ్మానందంలో ముంచి తీసుకు వెళతారు" అని పలక మీద వ్రాశారట. ఇది జరిగిన తరువాత సుబ్బారావు గారిలో చాలా మార్పులు వచ్చాయి. అంతకు మునుపు ఇతర విషయాలను గురించి కూడా మాట్లాడేవారు. తరువాతి కాలంలో 24 గంటలూ శివుణ్ణి గురించే మాట్లాడుతూ ఉండేవారు. అటు తరువాత మాట్లాడటం కూడా తగ్గించి వేశారు. సత్సంగాలు చేయటమనేది కూడా తగ్గించి వేశారు. వారిలో అంతర్మౌనం మొదలయింది. 40 రోజులు మౌనంలో ఉండాలని నిర్ణయం తీసుకొని అప్పటికప్పుడు మౌనంలోనే మౌన స్వామి వద్దకు వెళ్ళారు.

సాధారణంగా మామయ్య గారు డాక్టర్లు ఇంజక్షన్ చేస్తారంటే చాలా భయపడేవారు. అటువంటి వారిని ఆరోగ్యం క్షీణించటంతో చివరి రోజులలో హైదరాబాద్ లోని ఒక హాస్పిటల్‌లో చేర్పించారు. అప్పుడు వారి శరీరమంతా సూదుల మయమైంది. అన్ని సూదులు వారి శరీరంలో పొడిచినా వారిలో ఎటువంటి చలనము లేదు. దేహంతో సంబంధం తెగిపోయినట్లు అనిపించింది. ఏదో తెలియని నిర్లిప్తత, ప్రశాంతత ఆయనను ఆవరించాయి. ఆయన జీవన్ముక్తులయ్యారేమో అన్న భావన నాకు కలిగింది. అంతటి భగవదనుగ్రహం కలగాలంటే ఆ మనిషిలో ఎన్ని దైవీ గుణాలు ఉండి ఉండాలి? ఎంతమంది మహాత్ముల అనుగ్రహం వారి మీద ప్రసరించి ఉండాలి? వారు నిజంగా ధన్యజీవులు. (సశేషం)

# GOD: A POTTER

Dr K Subrahmanian

Sleep is very important for all of us; even a person who doesn’t physically exert himself would like to sleep. This is because we experience mental peace only when we sleep. In sleep, the mind disappears completely; we are not even aware where it goes. But after we are awake, the mind does not disappear even for a single second; it bothers us all the time. In everyday life, we experience both pain and pleasure; when we are asleep, there is neither pleasure nor pain, just an indescribable peace. When we don’t sleep properly for some days, we become miserable, because the mind does not get the rest it requires.

What all of us need is peace, and we experience it, not when we are asserting ourselves, but when the ego is completely gone. When it is a complete zero. Who are the people we like and feel comfortable with? We like people who are humble and who don’t assert themselves. Such people do not scare us, and in the process, do not threaten our ego. These people may not be *jnanis*, yet,in their presence, we feel safe and comfortable because we sense they will not hurt us by assaulting our delicate ego. Such individuals are not interested in proving that they are better than others, nor are they keen on insulting others.

When I introduce somebody to you, the first question you ask is, “What is he?” If I say that the person is an IAS officer, then your whole attitude towards the individual changes, you become respectful. You may know nothing

about the person, but you show him respect. In this case, we’re not respecting the individual; but the office – the position he holds. If the person is a retired IAS officer, then we don’t show the same kind of respect. We seldom treat people as people – the courtesy we show always depends on their status.

What we must remember is that all of us, one day or the other, will retire and cease to occupy a position. In fact, a time will come when your business will be run by your children. When you are young, you may be a big shot to people who know you. However, when your children’s friends see you, they don’t refer to you by your designation in an organisation, they simply say, “That is Anil’s father.” Children relate to someone else with something they know, and not how important someone is. When you go to your father-in-law’s place, how do the women refer to you? They talk about you as their daughter’s husband because you are not as important to them as their daughter.

Appaya Dikshitar, a great scholar who lived in the 18th century, was considered so important that even the king did *kanakabhisekham*. However, when he went to his father-in-law’s place, the ladies there pointed to him and referred to him as the husband of Achalu –Achalu being his wife’s name. When Dikshitar heard this, he said that it was extraordinary because although he was famous everywhere else, in this village, the more important person was his wife, Achalu.

*asmingrame Achalu prasiddha*

Although we may think we are the most important person, we must remember that our importance is limited to a small circle.

The truth is we are so focussed on ourselves, we don't really worry about other people. The first thing that I worry about is myself and my family. That's why Bhagavan says that all thoughts first relate to the I thought. When I don't think highly of myself, I become humble, and then I identify myself with other people. The moment I assert my myself, then others do the same. All quarrels in this world are the result of clashing egos; all quarrels, all disputes and all wars are the result of the conflict between two big egos. On the other hand, when someone says, “You are a fool”, and I respond by saying, “I am aware of it”, the other person feels bad, and apologises immediately. This is because the moment you don't assert your ego, you become humble; with this humility, your whole attitude towards the people around you, changes. When there is no sense of ego, there is more concern for others.

